ఈనాడు
రాజన్న సిరిసిల్ల
మంగళవారం సెప్టెంబరు 1, 2026

● డిగ్రీ చదువుతున్న ఓ యువకుడు కరీంనగర్‌లోని ఓ మెడికల్ దుకాణానికి వెళ్లి నొప్పులకు ఉపయోగించే పది మాత్రలు ఉండే ఓ షీటును ఐదేసి కొనుగోలు చేసి తీసుకెళ్లాడు. మత్తుకోసం వాటిని ఉపయోగిస్తున్నాడు.

● కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పలు మెడికల్ దుకాణాల్లో నొప్పుల మాత్రలను ఇష్టమొచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఓ మెడికల్ దుకాణంపై ఇటీవల పోలీసులు దాడి చేసి కేసు నమోదు చేశారు. ఆగస్టులో పెద్దపల్లి జిల్లాలో ఈ మాత్రలు విక్రయిస్తున్న అంశంపై కేసు నమోదైంది. మండలంలోనూ కేసు నమోదు చేశారు.

ఏ మాత్రం పట్టదు..

● ప్రిస్క్రిప్షన్ లేకున్నా దుకాణాల్లో అమ్మకాలు
● ఔషధాల 'మత్తు'లో యువత

న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం

వైద్యుల చీటీ లేకుండా కొన్ని రకాల ఔషధాలను విక్రయించకూడదనే నిబంధనలున్నా ఉమ్మడి జిల్లాలోని మెడికల్ దుకాణాల యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో మత్తుకు అలవాటుపడిన కొందరు నొప్పుల మాత్రలు కొనుగోలు చేసి వినియోగిస్తూ రోజంతా మత్తులో జోగుతున్నారు. సంబంధిత అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో విచ్చలవిడిగా ఈ వ్యాపారం సాగుతోంది.

రెట్టింపు ధరలకు..

● పలు రకాల నొప్పులు నయం కావడానికి వైద్యులు రాసే మాత్రలు వాడినప్పుడు నొప్పి తగ్గడంతోపాటు కాస్త మత్తు వచ్చినట్లు ఉంటుంది. కానీ ఈ మాత్రలను యువతతోపాటు అసంఘటిత రంగాల్లో పని చేసేవారు, లారీల డ్రైవర్లు, క్లీనర్లు కొనుక్కుని సూది మందులా వినియోగించి మత్తులో జోగుతున్నారు.

● కరీంనగర్‌లో మాత్రలను కొనుగోలు చేసి రెట్టింపు ధరకు ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉమ్మడి జిల్లాతోపాటు ఆసిఫాబాద్, నిజామాబాద్, మంచిర్యాల తదితర ప్రాంతాల వారికి ఇక్కడి నుంచే సరఫరా అవుతున్నట్లు తెలుస్తోంది.

గతంలో దగ్గు మందు

మత్తులో ఉండేందుకు కొందరు కార్మికులు, యువత గతంలో కొన్ని దగ్గు సిరప్‌లు తాగేవారు. వాటిని నిషేధించిన తర్వాత వైట్నర్ వాడారు. ఇప్పుడు నేరుగా నొప్పి మాత్రలను నీళ్లలో కలుపుకొని సూది మందులా వినియోగిస్తున్నారు.

మెదడు దెబ్బతింటుంది

సాధారణంగా ఈ మాత్రలు నొప్పులు తగ్గడం కోసం అవసరమైన మేరకు రాస్తుంటాం. రోగులు మాత్రమే వాడాలి. ఆరోగ్యంగా ఉన్న యువత వాడితే మెదడు దెబ్బతింటుంది. మత్తులో ఉంటారు. ఒక్కోసారి నిద్రలో అకస్మాత్తుగా వచ్చిన ఆలోచనలతో ఇష్టం ఉన్నట్లు వ్యవహరిస్తారు. ఆలోచన ధోరణి మారుతుంది.

- డాక్టర్ ఎం.విజయమోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్

లైసెన్సులు రద్దు చేస్తాం

డాక్టర్ చీటీ లేకుండా ఇలాంటి మాత్రలు విక్రయించే వారి సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. మెడికల్ షాపుల లైసెన్స్ రద్దు చేస్తాం. ఇప్పటి వరకు రెండు కేసులు నమోదు చేశాం.

- శ్రవణ్‌కుమార్, జిల్లా ఔషధ నియంత్రణాధికారి, కరీంనగర్

కచ్చితత్వంతో భూముల రీ సర్వే

సిరిసిల్ల కలెక్టరేట్ : జిల్లాలోని భూముల రీ సర్వే ప్రక్రియను రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులు సమన్వయం, కచ్చితత్వంతో పూర్తి చేయాలని కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూముల రీ సర్వేలో భాగంగా వివరాలను క్షేత్రస్థాయిలో పక్కాగా సేకరించాలని సూచించారు. సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కేఎస్‌బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హోదా పెంచారు.. వేతనాలు పంచారు

గరిష్ఠంగా రూ.5 వేల వరకు..

● రెండు పురపాలికల్లో రూ.14 కోట్ల అదనపు చెల్లింపులు

ఈనాడు, సిరిసిల్ల

పురపాలక శాఖలో పని చేస్తున్న పొరుగు సేవల ఉద్యోగులకు సీడీఎంఏ ఉత్తర్వులకు భిన్నంగా వేతనాలు పెంచుతున్నారు. హోదాలతో సంబంధం లేకుండా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారు. ఆర్థికంగా భారమైన పెంచిన వేతనాల సవరణ జూన్‌లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కానీ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో పాత వేతనాలనే పొందుతున్నారు. తనిఖీల్లో వెలుగు చూసిన అక్రమాలపై సమాచారం ఇవ్వడంలోనూ తాత్సారం జరుగుతోంది.

పబ్లిక్ హెల్త్ వర్కర్లకు రూ.16,600లకు రూ.17,600లు, డ్రైవర్లకు రూ.16,600లకు, రూ.21,500లు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.19,500లకు, రూ.24,750లు.. ఆఫీస్ సబార్డినేటర్లకు ఇతరులకు రూ.15,500లకు రూ.17,500 చెల్లిస్తున్నారు. ఇలా రెండు పురపాలికల్లో రూ.1000 నుంచి గరిష్ఠంగా రూ.5 వేల వరకు పెంచుకున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. నెలకు అదనంగా రూ.7 లక్షల పైబడిన వేతనాలు అదనంగా చెల్లింపులు జరుగుతున్నాయి. 2024 నుంచి ఇప్పటికి సుమారు రూ.14 కోట్ల మేర పక్కదారి పట్టాయి.

నిఘా

✸ ప్రభుత్వం జూన్‌లో వెలువర్చిన ఉత్తర్వుల ప్రకారం పురపాలికల్లో 8 కేటగిరీలుగా గుర్తించింది. ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా ఉద్యోగులను విభజించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా.. పబ్లిక్‌హెల్త్ వర్కర్లు, జవాన్లను, పంపు ఆపరేటర్లుగా మార్చారు. అంతేకాకుండా రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, శానిటరీ ఇలా ఒక్కో విభాగంలో ఇద్దరు, ముగ్గురు ఆపరేటర్లు ఉన్నారు. వీరిని ఆ హోదా ఎలా మార్చారనేది స్పష్టత లేదు. రాష్ట్ర స్థాయిలో పురపాలికల్లో లెక్కలు తేల్చేందుకు ఆడిట్, ట్రెజరీ, రెవెన్యూ శాఖల ఉద్యోగులతో ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది.

నాలుగు కేటగిరీల్లో..

సిరిసిల్లలో 352, వేములవాడలో 203 మంది పొరుగు సేవల విభాగాల్లో పనిచేస్తున్నారు.. పబ్లిక్ హెల్త్ వర్కర్లు, డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఆఫీసు సబార్డినేట్స్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి నాలుగు కేటగిరీల్లో జీతాలు చెల్లిస్తున్నారు. సీడీఎంఏలోని పొరుగు సేవల ఉద్యోగులకు ప్రభుత్వం నిర్దేశించిన వేతనాల కంటే అదనంగా చెల్లిస్తున్నట్లు ఆడిట్ శాఖ గుర్తించింది. రెండు పురపాలికల్లో పొరుగు సేవల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్నారు.

నివేదికలపై స్పందనేది?

కమిటీకి పురపాలికలు పూర్తి నివేదికలు ఇవ్వాలని 15 రోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలో రెండు పురపాలికల నుంచి స్పందనలేదు. అదనపు చెల్లింపుల వేతనాలతోపాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను కూడా లెక్కించి సంబంధిత కమిషనర్లు, కార్య నిర్వాహక అధికారులకు తెలియజేయాల్సి ఉంది. జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖల్లోనూ పొరుగు సేవల ఉద్యోగులకు ఈ తరహా చెల్లింపులు జరుగుతున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం గుర్తించింది.

లడ్డూ ప్రసాదంలో పురుగు ప్రత్యక్షం

వేములవాడ, న్యూస్‌టుడే : వేములవాడ రాజన్న లడ్డూ ప్రసాదంలో సోమవారం పురుగు ప్రత్యక్షం కావడం భక్తులను ఆందోళనకు గురిచేసింది. సిరిసిల్ల పట్టణానికి చెందిన సంతోష్ దంపతులు సోమవారం శ్రీ భీమేశ్వరస్వామివారి దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం లడ్డూలను కొనుగోలు చేసి ప్రసాదం స్వీకరించేందుకు కవర్ తీయగా అందులో లడ్డూతో పాటు చిన్న పురుగు ప్రత్యక్షమైంది. దీంతో అవాక్కయ్యారు. అదే లడ్డూ కవర్‌తో వెళ్లి ఆలయ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపడుతామని అధికారులు తెలిపారు.

కుట్టు.. నాణ్యత మెరిసేట్టు

● సిద్ధమవుతున్న ఏకరూప దుస్తులు

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయగా, కుట్టుపని దాదాపు చివరి దశకు చేరింది.. సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా ప్రభుత్వం ఏటా ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫాం అందజేస్తోంది.. గతేడాది నుంచి కుట్టుపని బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అనుభవం ఉన్న వారిని గుర్తించి నాణ్యతగా కుట్టిస్తున్నారు.

☛ జిల్లాలోని 415 పాఠశాలలు ఉండగా 29,142 మంది విద్యార్థులు చదువుతున్నారు. బాలికలు 14,304, బాలురు 14,838 మంది ఉన్నారు. మహిళలు గతంలోనే పాఠశాలలకు వెళ్లి విద్యార్థుల కొలతలను తీసుకున్నారు. ఇటీవల ప్రభుత్వం వస్త్రం పంపిణీ చేయడంతో కుట్టడంలో నిమగ్నమయ్యారు. ముందుగా ప్రతి విద్యార్థికి ఒక జత దుస్తులను అందించనున్నారు. ఇవి పూర్తయిన తర్వాత రెండో జత పనులు ప్రారంభించనున్నారు.

ఇల్లంతకుంట : కందికట్కూర్‌లో ఏకరూప దుస్తులు కుడుతున్న మహిళలు

☛ జిల్లాలో మొత్తం 411 గ్రామ సంఘాలు ఉండగా, స్వయం సహాయక సంఘాలు 10,831 ఉన్నాయి. వీటిలో 1,10,773 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో కుట్టులో అనుభవం ఉన్నవారిని 335 మందిని అధికారులు ఎంపిక చేశారు. వీరిలో 50 శాతం మందికి హైదరాబాద్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు.

☛ ఇప్పటికే జిల్లాలో 11,717 ఏకరూప దుస్తులు పూర్తయి పాఠశాలలకు అందించారు. వీటిలో బాలికలు- 6,244, బాలుర- 5,473 ఉన్నాయి. ప్రతి పాఠశాలలో ఒక మహిళా సంఘ సభ్యురాలు పర్యవేక్షిస్తూ దుస్తుల్లో ఏమైనా సమస్యలు ఉంటే అక్కడే సరిచేసి అందజేస్తారు. ఎక్కువ మందికి తేడాలు ఉంటే వాటిని కేంద్రానికి తీసుకెళ్లి ఇస్తారు.

మండలానికో కేంద్రం..

గతంలో మహిళలు వారి ఇళ్లల్లో కుట్టి అందించేవారు. దీంతో కొలతల్లో తేడాలు, గుండీలు ఊడిపోవడం వంటివి జరిగేవి.. అలాంటి లోపాలు తలెత్తకుండా ఈ ఏడాది జిల్లాలో ప్రతి మండలంలో 2 నుంచి 5 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వాటిని మహిళా సంఘ భవనాలు, ప్రైవేట్ కార్యాలయాలు, జీపీ భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో 10 నుంచి 15 మంది మహిళలు ఏకరూప దుస్తులను కుడుతున్నారు. ఒక్కొక్కరు ప్రతి రోజు 10 దుస్తులు కుట్టాలని లక్ష్యం విధించారు. చినిగిపోకుండా దగ్గరగా రెండు కుట్లు వేస్తున్నారు. నాణ్యత పరిశీలనకు ఒకరిని(చెక్కర్) నియమించారు. ప్రతిరోజు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో ఆ వివరాలను మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు సులభంగా చూడొచ్చు.

భీమన్న క్షేత్రం.. భక్తజన సంద్రం

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి క్షేత్రం శ్రావణ సోమవారం కావడంతో భక్తజన సంద్రంగా మారింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో పోటెత్తారు. ఆలయ క్యూలైను భక్తులతో నిండిపోయి పార్కింగ్ వరకు కొనసాగింది. దాదాపు 75 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ ఈవో నవీన్‌కుమార్, ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షణ చేశారు. పలువురు భక్తులు బద్ది పోచమ్మ అమ్మవారిని దర్శించుకుని బోనాలు సమర్పించారు.

క్యూలైన్ దాటి ఆలయ పార్కింగ్ వరకు వేచి ఉన్న భక్తులు

కొత్త జంటలు.. కల్యాణ మొక్కులు

వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి క్షేత్రంలో శ్రావణ సోమవారం భారీ సంఖ్యలో భక్తులు కల్యాణ మొక్కులు చెల్లించుకున్నారు. భీమేశ్వరాలయం సమీపంలోని నిత్యాన్నదాన సత్రం పై అంతస్తులోని హాల్లో కల్యాణాలను వేద పండితులు, అర్చకుల మంత్రోచ్చారణలతో ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు, కొత్తపెళ్లి జంటలు భారీ సంఖ్యలో కల్యాణాల మొక్కులు తీర్చుకోవడంతో హాల్ జంటలతో కిక్కిరిసిపోయింది. దాదాపు 200కు పైగా కల్యాణ టికెట్లను జారీ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

సమస్యలపై చర్చించి.. ఎజెండా అంశాలను ఆమోదించి

సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే : సిరిసిల్ల పురపాలక సంఘం సాధారణ సమావేశంలో మొత్తం 25 ఎజెండా అంశాలను ఆమోదించారు. సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ మాట్లాడుతూ.. రాబోయే బతుకమ్మ, దసరా పండగలను పురస్కరించుకొని వివిధ వార్డుల్లో బతుకమ్మ నిమజ్జనం ఏర్పాట్ల కోసం రూ.29 లక్షలు, వివిధ వార్డుల్లో కల్వర్టులు, ఇతర పనులకు రూ.59 లక్షలు, వీధి దీపాల నిర్వహణకు రూ.10 లక్షలు, మురుగు కాల్వలు, సీసీ రోడ్లకు రూ.21 లక్షలు, పురపాలక సంఘం భవనం ఆధునికీకరణకు రూ.42 లక్షలు, పట్టణంలోని విద్యానగర్, నెహ్రూ నగర్ వైకుంఠ ధామాల మరమ్మతులకు రూ.10 లక్షలు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ దార్ల సందీప్, కమిషనర్ ఖదీర్ పాషా, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

✦ సమావేశం సందర్భంగా డ్రగ్స్ నివారణ చర్యలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై వాటి ప్రభావం, యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు.

సిరిసిల్లలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ కళ

వేములవాడలో మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు

పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధి

వేములవాడ : పార్టీలకు అతీతంగా పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. పట్టణ ప్రగతి, పారిశుద్ధ్యం నిర్వహణ తదితర అంశాలపై సభ్యులు చర్చించారు. ఈ సందర్భంగా 32 ఎజెండా అంశాలపై సభ్యులు చర్చించిన అనంతరం ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వన మహోత్సవంలో 15 వేల మొక్కలు పంపిణీ చేసేందుకు నిర్ణయించి ఇంటింటికి రెండు మొక్కలు అందించేందుకు సభ్యులు తీర్మానించారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. ప్రతి వార్డులో కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లే పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ లోకేష్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

చేయూతకు దరఖాస్తుల వెల్లువ

ఉమ్మడి జిల్లాలో 52,433 నమోదు

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

సుదీర్ఘ కాలం తర్వాత ప్రభుత్వం చేయూత(ఆసరా) పథకంలో పింఛన్ పొందేందుకు అవకాశం కల్పించింది. అర్హులు ఆధార పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించింది. ఈ క్రమంలో ఆశావహులు భారీగా దరఖాస్తు చేసుకున్నారు. అవసరమైన పత్రాలతో మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలు కావడంతో పంచాయతీల్లోనే భారీగా దరఖాస్తు చేసుకున్నారు. సోమవారం నాటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 52,433 దరఖాస్తులు వచ్చాయి.

ఉమ్మడి జిల్లాలో దరఖాస్తుల వివరాలు

	జగిత్యాల	కరీంనగర్	పెద్దపల్లి	రాజన్నసిరిసిల్ల
వితంతు	5,732	8,542	7,112	3,571
ఒంటరి మహిళా	1,086	983	869	301
దివ్యాంగులు	2,266	6,559	2,836	1,808
చేనేత	2,191	1,122	469	937
గీత కార్మిక	1,970	1,745	1,305	1,018

అనర్హులను తొలగించి జాబితా..

ఉమ్మడి జిల్లాలో 52,433 దరఖాస్తులు రాగా వీటిలో జగిత్యాలలో 13,256, కరీంనగర్ 18,951, పెద్దపల్లిలో 12,591, రాజన్న సిరిసిల్లలో 7,635 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో అత్యధికంగా వితంతువులు 24,957, తర్వాత 13,469 దివ్యాంగులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో కమిషనర్ పర్యవేక్షణలో దరఖాస్తులు పరిశీలించనున్నారు. అక్రమాలకు తావులేకుండా 360 డిగ్రీల సాంకేతిక విధానంతో వడబోత చేపట్టనున్నారు. అనర్హులను తొలగించి జాబితా రూపొందించనున్నారు.

తప్పని దళారుల బెడద..

చేయూత పింఛన్ కోసం దరఖాస్తుల స్వీకరణ మొదలు నుంచి దళారులు అమాయకులను మచ్చిక చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో కొందరు ప్రజాప్రతినిధులు బేరసారాలు కుదుర్చుకుంటున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగిన బాధితులు అడిగినంతా ఇచ్చేందుకు అంగీకరిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రామగుండంలో ప్రజాప్రతినిధుల జోక్యంపై ఆరోపణలు రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్లు స్పందిస్తూ దళారులను ఆశ్రయించరాదని ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది.

జిల్లాకు విచ్చేసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్

వేములవాడ, న్యూస్‌టుడే : జిల్లా పర్యటనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య సోమవారం రాత్రి వేములవాడలోని భీమేశ్వర సదన్‌లోని అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితె మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. మంగళవారం ఉదయం శ్రీ భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్న అనంతరం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలోని ఆడిటోరియంలో జిల్లా అధికారులతో ఛైర్మన్, సభ్యులు సమీక్ష నిర్వహించనున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో కేఎస్‌బీ కుమారి, డీఎస్పీ శ్రీనివాసులు, ఆలయ డిప్యూటీ ఈవో నవీన్‌కుమార్, ఎస్సీ అభివృద్ధి అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఎస్టీ సంక్షేమ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, తహసీల్దార్ జయంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బక్కి వెంకటయ్యకు పూల మొక్క అందజేస్తున్న కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితె

చెరువుల మరమ్మతులకు ప్రతిపాదనలు

వేములవాడ, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని చెరువుల అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నీటిపారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నీటి పారుదల శాఖ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలోని 394 చెరువులను పరిశీలించి దెబ్బతిన్న వాటికి అత్యవసరంగా చేపట్టాల్సిన మరమ్మతులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. చెరువుల మత్తళ్లు, కింద ఉన్న బండ్‌లు, తూములు దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి మరమ్మతులకు అంచనాలు సిద్ధం చేయాలని విప్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ రమేష్, ఈఈ ప్రశాంత్, డీఈ దయాకర్, పలువురు ఏఈలు పాల్గొన్నారు.

నీటిపారుదల అధికారులతో సమీక్షిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

రాజన్న చెంత.. వసతి చింత

న్యూస్‌టుడే, వేములవాడ

దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్రానికి ఏటా భక్తుల సంఖ్య పెరుగుతున్నా.. వచ్చే వారికి వసతి గదులు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాజన్న ఆలయంలో జరిగే వివిధ ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తుంటారు. ఇలాంటి సందర్భంలో వసతి గదులు లభించక ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయిస్తుంటారు. మరికొందరు ఆలయ మెట్ల ప్రాంతాల్లో, పార్కింగ్‌లోని చలువ పందిళ్ల కింద సేదతీరి వంటావార్పు చేసుకుంటారు. ఎక్కువ మంది విడిది చేసి మరుసటి రోజు స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ.. ఇలాంటి సందర్భంలో ప్రైవేటులో అధిక ధర చెల్లించి గదులను తీసుకోవల్సిన పరిస్థితి ఆందోళనకు గురి చేస్తోంది.

శిథిలమైన శివపురం ధర్మశాలలు

✶ ఆలయానికి చెందిన భీమేశ్వర సదన్, పార్వతీపురం, శ్రీ లక్ష్మీగణపతి కాంప్లెక్స్, నందీశ్వర కాంప్లెక్స్, అమ్మవారి కాంప్లెక్స్‌లలో దాదాపు 436 వరకు గదులున్నాయి. ప్రతిరోజు స్వామి వారి దర్శనానికి వేలల్లో వచ్చే భక్తులకు ఇవి ఏమాత్రం సరిపోవడం లేదు. దీంతో ఆలయ పరిసరాల్లో విడిది చేయాల్సిన పరిస్థితి ఇబ్బందులకు గురి చేస్తోంది. ఆలయానికి చెందిన శివపురం, శంకరపురం, వసతి గదులు శిథిలమవడం.. వాటిని తొలగించే ఉద్దేశంతో భక్తులకు ఇవ్వడం లేదు. శిథిలమైన కాంప్లెక్స్ స్థానాల్లో కొత్తగా వసతి గదుల నిర్మాణాలు చేస్తే భక్తులకు కొంతవరకైనా తిప్పలు తొలగనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

✶ రాజన్న ఆలయంలో మహా శివరాత్రి, శివ కల్యాణం, ఇతరత్రా ఉత్సవాల సందర్భంలో భక్తులు లక్షల్లో వస్తారు. ఇలాంటి సందర్భంలో వసతి గదులు ఏమూలకు సరిపోవడం లేదు. వివిధ వేడుకల సందర్భంగా అసలు భక్తులకు గదులు ఇవ్వకుండా విధులు నిర్వహించే అధికారులకు కేటాయిస్తుంటారు. దీంతో భక్తుల ఇబ్బందులు వర్ణణాతీతంగా ఉంటాయి.

60 గదులకు అంచనాలు సిద్ధం

- రాజేష్, ఆలయ ఈఈ, వేములవాడ

ఆలయానికి చెందిన శిథిలమైన కాంప్లెక్స్ స్థానంలో కొత్తగా వసతి గదుల నిర్మాణానికి ప్రతిపాదనలు చేశాం. ఇందులో శివపురం కాంప్లెక్స్ వద్ద 60 గదుల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేస్తున్నాం. కింద పార్కింగ్, పైన వసతి గదుల నిర్మాణానికి ప్రణాళిక తయారు చేస్తున్నాం.

చరవాణిలో నిమగ్నం.. ప్రజావాణికి భగ్నం

మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మొక్కుబడిగా మారుతోంది.. కోనరావుపేటలో 28 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కేవలం ముఖ్యమైన శాఖల అధికారులే వచ్చారు. వారు కూడా సెల్‌ఫోన్లలో నిమగ్నమై.. విధులను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. ప్రజావాణికి మొత్తం 7 దరఖాస్తులు వచ్చాయి. విధులపై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కోనరావుపేట**

నమూన ప్రకటన
బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా అందరికీ తెలియజేయునది ఏమనగా నా క్లయింటుయగు శ్రీ .... వా .... నివాసంగా శ్రీ .... వారికి చెందినటువంటి గృహము ఇంటి నెం. మరియు ఖాళీ జాగా, ఈ క్రింద హద్దులు గల ఉత్తరం : ఇతరుల ఖాళీ జాగా, దక్షిణం : 20 ఫీట్ల రోడ్డు, తూర్పు: ఇతరుల ఖాళీ జాగా, పడమర: .... గారి ఇల్లు, పట్టణంలో గల దానిని కొనడానికి అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. మరియు అడ్వాన్సు కూడా ఇచ్చియున్నారు. ఇట్టి విషయంగా ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల వారం రోజులలోగా సాక్ష్యములతో సహ నన్ను సంప్రదించగలరు. ఆ తరువాత వచ్చే ఎటువంటి క్లయిములు నా క్లయింటును బైండ్ చేయజాలవు.
సం/-
విజ్ఞతగల నిర్ణయం.
వివాదాలకు అతీతం.

25% డిస్కౌంట్ కలదు
లక్షల విలువైన స్థిరాస్తిని కొనేముందు సరైన నిర్ణయం తీసుకోవడం అవసరం. 'ఈనాడు'లో బహిరంగ ప్రకటన ఇవ్వడం ఎంతో సులభం.
వివరాలకు సంప్రదించండి : GST 5% Applicable
Cell: 80087 09949

(c) eenadu

చీడపీడలు.. యాజమాన్య పద్ధతులు

న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

ప్రధాన పంట మామిడిలో ఇటీవల దిగుబడులు పెరగటం, కాతతగ్గుల వంటి పలు సమస్యలు తలెత్తుతున్నాయి. కేవలం కాత సమయంలోనే కాకుండా కాయలు తెంపిన తర్వాత నుంచి మామిడి తోటల్లో తగిన యాజమాన్య పద్ధతులు చేపడితేనే తదుపరి సీజన్‌లో అధిక, నాణ్యమైన కాత చేతికివస్తుందని ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ కె.స్వాతి సూచిస్తున్నారు.

మామిడిచెట్లు

● ఒక కిలో మైలుతుత్తం, ఒక కిలో పొడిసున్నాన్ని 100 లీటర్ల నీటికి కలిపి తయారుచేస్తే 1 శాతం బోర్డోమిశ్రమం తయారవుతుంది. కొమ్మలు తొలగించిన తరువాత తెగుళ్లు సోకకుండా ఉండేందుకు ఈ మిశ్రమాన్ని చెట్లపై పిచికారీ చేయాలి. లేదా కొమ్మ కత్తిరించిన భాగాలపై బోర్డోపేస్టును పూయాలి. బోర్డో మిశ్రమాన్ని ఎప్పటికప్పుడు తయారు చేసుకోవచ్చు.

● మామిడి కాయలు తెంపిన తరువాత చెట్లపై ఎండిన, అడ్డదిడ్డంగా పెరిగిన, చీడపీడలు ఆశించిన కొమ్మలను, ఆకులను తీసివేయడం ద్వారా చెట్టు లోపలి భాగాలకు గాలి, వెలుతురు బాగా అంది చీడపీడల బెడద తగ్గుతుంది. తోటలో రాలి, కుళ్లిపోయిన కాయలు, చెత్తాచెదారాన్ని తీసివేయాలి.

● వర్షాలు లేదా నీటితడితో నేల తడిగా మారిన తరువాత పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టును మొక్కల మొదళ్ల చుట్టూ వేసి చెట్లమధ్యన దున్నాలి. చిన్నచెట్లు గల తోటల్లో పెసర, మినుము, అలసంద, వేరుసెనగ, అల్లం, కూరగాయలు తదితర అంతర పంటలు లేదా జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట పైర్లను సాగుచేయవచ్చు.

● తొలిదశలో చెట్టుకు 750 గ్రాముల యూరియా, 2 కిలోల పాస్ఫరస్, అరకిలో పొటాష్‌ను వేయాలి. ఆగస్టు నుంచి చెట్టు చిగురించే దశలో 100 గ్రాముల జింకు, 50 గ్రాముల బోరాన్ చొప్పున ఒక్కో చెట్టుకు వేయాలి. పూతదశలో 5 శాతం జింకుసల్ఫేట్, 2 గ్రాముల చొప్పున మెగ్నీషియం, మాంగనీస్, ఫెర్రస్, బోరాక్స్, 6 శాతం రాళ్లసున్నం, 10 గ్రాముల యూరియాను సాండోవిట్‌తో కలిపి పిచికారీ చేయవచ్చు. లేతాకుల దశలో ఆకుగూడు పురుగు నివారణకు వేపనూనె పిచికారీ చేయాలి. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు లీటరు నీటికి 2 మి.లీ క్లోరోపైరిఫాస్‌ను కలిపి పిచికారీ చేయాలి.

● తేనెమంచు పురుగు నివారణకు సెప్టెంబరు తరువాత లీటరు నీటికి 2 మి.లీ క్లోరోపైరిఫాస్ వంతున కలిపి పిచికారీ చేయాలి. చెట్ల వయసును బట్టి పదేళ్ల వయసుగల చెట్టుకు 2.2 కిలోల యూరియా, 6 కిలోల సూపర్ ఫాస్ఫేట్, 1.6 కిలోల పొటాష్ ఎరువులను వేయాలి. అక్టోబరు తొలివారంలో పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి చల్లాలి. డిసెంబరు మొదటి పక్షంలో తేలికపాటి నీటితడిని ఇవ్వాలి. బిందుసేద్యం గల రైతులు రసాయన ఎరువులను బిందుసేద్య పరికరాల ద్వారా(ఫర్టిగేషన్) అందించవచ్చు. ఇందుకు నీటిలో కరిగే రసాయన ఎరువులను వాడాలి.

పర్యావరణ హితుడు.. మట్టి గణపతి

న్యూస్‌టుడే, ఫెర్టిలైజర్ సిటీ

గణపతి నవరాత్రి ఉత్సవాలు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. వాడవాడలా విగ్రహాలను నెలకొల్పేందుకు ఉత్సవ కమిటీలు సన్నద్ధమవుతున్నాయి. ఇప్పటికే విగ్రహాల తయారీ కేంద్రాల్లో ముందస్తు బుకింగులు చేసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో అయిదు వేలకు పైగా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తుండగా మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసేవి వంద లోపే ఉండటం గమనార్హం. ఇళ్లలో మాత్రం ఎక్కువగా మట్టి ప్రతిమల ఏర్పాటుకు ప్రాధాన్యమిస్తుంటారు. స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలతో కలిగే ప్రయోజనాలు, పీవోపీ(ప్లాస్టర్ ఆఫ్ పారిస్) విగ్రహాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ ఎక్కువ మంది తక్కువ ధరకు వస్తుందనే కోణంలో ఎక్కువగా పీవోపీ వైపే మొగ్గు చూపుతున్నారు.

స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు

ఉమ్మడి జిల్లాలో కొన్ని స్వచ్ఛంద సంస్థలు ఉచితంగా మట్టి ప్రతిమలను పంపిణీ చేయడంతో పాటు ఎత్తయిన విగ్రహాలను నెలకొల్పుతుంటాయి. పెద్దపల్లిలోని ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేస్తుండగా ఎనిమిదేళ్లుగా 63 అడుగుల మట్టి విగ్రహాన్ని నెలకొల్పుతున్నారు. అగ్నిమాపక యంత్రం ద్వారా నెలకొల్పిన ప్రదేశంలోనే నిమజ్జనం చేస్తున్నారు. మట్టి విగ్రహాల తయారీలో మట్టి, కొబ్బరిపీచు, వెదురు, జనుము మాత్రమే వినియోగించడంతో పర్యావరణానికి ఎలాంటి నష్టం ఉండదు. రామగుండం నగరపాలక ప్రాంతంలో తెలంగాణ మహిళా మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలుగా మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు మహిళలకు ఉపాధి కల్పిస్తున్నారు. మట్టి ప్రతిమలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి ప్రతిమలతో పూజించాలంటూ సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

పెద్దపల్లిలో సిద్ధమవుతున్న 63 అడుగుల మట్టిప్రతిమ

ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యం

సెప్టెంబరు 14 నుంచి వినాయక నవరాత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పూజకు వినియోగించే వివిధ రకాల పత్రాలతో పాటు ప్రతిమల్లోనూ పర్యావరణ హితం, ఆరోగ్య పరిరక్షణ ఉంటుంది. భక్తితో చేసే పూజల కంటే ఆర్భాటాలకే అధిక ప్రాధాన్యతనిస్తూ ఎత్తయిన పీవోపీ విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారు. ఈ విగ్రహాలను నదులు, చెరువుల్లో నిమజ్జనం చేస్తే సులువుగా కరగకపోవడంతో పాటు జలచరాలకు నష్టం చేకూరుస్తాయి. మట్టి విగ్రహాలు నిమజ్జనం చేసిన కొంత సమయానికే కరిగిపోతాయి. ఎలాంటి కాలుష్యం ఉండదు. గణపతి మండపాల నిర్వాహకులు, భక్తులు, పర్యావరణహితం కోరే వారు స్పందిస్తేనే ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది.

రైతు ప్రశ్న - శాస్త్రవేత్త సమాధానం

సాగులో రైతుల సందేహాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త **జి.వేణుగోపాల్** నివృత్తి చేశారు.

? బంతిలో మొగ్గ తెగులు నివారణకు ఏం చేయాలి. – మనోహర్‌రెడ్డి, మాచనపల్లి

✓ కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి మొగ్గలు విచ్చుకోకముందే పిచికారీ చేయాలి.

? పొద చిక్కుడులో పురుగు నివారణ ఎలా. – శ్రీహరి, బేతిగల్

✓ పురుగు ఉద్ధృతిని బట్టి ఎకరానికి 200 లీటర్ల నీటిలో ఫ్లూబెండమైడ్ 60 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.

? పాలకూర ఆకులు ముడతలు వస్తే ఏం చేయాలి. – వెంకన్న, సైదాబాద్

✓ 3 గ్రాముల పోషకాలను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? లిల్లీ పూలను రసం పీల్చే పురుగులు ఆశిస్తున్నాయి. –రజనీకాంత్, వెల్లంపల్లి

✓ నివారణకు లీటరు నీటికి డైమిథోయేట్ 2 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

? వంగ తోటలో నల్లి ఎక్కువగా కనిపిస్తోంది. – రాజేశ్వర్‌రావు, శ్రీరాములపేట

✓ నివారణకు నీటిలో కరిగే గంధకం 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

- న్యూస్‌టుడే, జమ్మికుంట

పశు పోషణతో లాభాల పంట

పశుపోషణతో లాభాలు ఆర్జిస్తున్నారు పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం సిద్దపల్లె గ్రామానికి చెందిన జాబు సతీశ్‌కుమార్. వివరాలు ఆయన మాటల్లోనే.. నాకున్న అయిదున్నర ఎకరాల భూమిలో 5 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నా. ఇంటి సమీపంలోని 30 గుంటల భూమిలో 5 గుంటల్లో పశువుల కోసం ప్రత్యేకంగా షెడ్డు వేసి ముర్రా, ఒంగోలు జాతికి చెందిన గేదెలను తెచ్చా. 10 గుంటల్లో ఏపీపీఎన్, సుపిరియర్‌పిన్నియా జాతి గడ్డిని పెంచుతున్నా. నిత్యం ఉదయం 40-50 లీటర్ల పాలను యైటింక్లయిన్‌కాలనీ, మహాకవిపోతన కాలనీ ఏరియాలోని సింగరేణి కుటుంబాలకు లీటరు రూ.80 చొప్పున విక్రయిస్తున్నా. ఒక్కో గేదె 8-10 లీటర్ల పాలు ఇస్తుంది. ఎదకు వచ్చేంత వరకు పాలిస్తాయి. మొదటి ఆరు మాసాలు 11, మరో ఆరు మాసాలు 8 గేదెలు పాలు ఇస్తుంటాయి. దూడల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించడంతో కొత్తవి కొనుగోలు చేయాల్సిన అవసరం రాదు. పచ్చి, ఎండుగడ్డితో పాటు పెసరపొట్టు, గోధుమపరం, పల్లిపిండి, బెల్లం దాణాగా వేస్తుంటా. 15 రోజులకు ఒకసారి పశువైద్యుడితో వైద్యపరీక్షలు చేయిస్తా. మొత్తం నెలకు ఖర్చు రూ.30 వేల వరకు వస్తుండగా దాదాపు రూ.80 వేల ఆదాయం వస్తోంది.

- న్యూస్‌టుడే, యైటింక్లయిన్‌కాలనీ

పశువుల పాకలో గేదెలు

సతీశ్‌కుమార్

ఆదర్శం

రసాయనాలు లేకుండా కూరగాయల సాగు

మీకు తెలుసా?

కూరగాయలను పండించదలిస్తే దుక్కిలోనే పశువులు, కోళ్ల, జీవాల ఎరువు లేదా వర్మీకంపోస్టును వేసి కలియదున్నాలి. వేపపిండి, వేరుసెనగపిండి, ఆముదపుపిండి తదితరాలు వాడొచ్చు. పంటమార్పిడి పాటించాలి. వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేయకుండా నేలలోనే కలియదున్నాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబ్యాక్టీరియాను వినియోగించవచ్చు. రసాయనాలు వాడకుండా సహజ సస్యరక్షణ యాజమాన్యం, జీవ నియంత్రణ పద్ధతులు పాటించాలి. అవసరముంటే వేపనూనెను పిచికారీ చేయాలి. సేంద్రియ పద్ధతులవల్ల పంటనాణ్యత పెరిగి మన ఆరోగ్యం బాగుంటుంది.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

మంచిర్యాలలో కేంద్రీకృత వంటశాల

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే : తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాంలో భాగంగా మంచిర్యాల జిల్లా కేంద్రంలో సోమవారం కేంద్రీకృత వంటశాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్, సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటైన వంటశాలలో మంచిర్యాల, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని 691 ప్రభుత్వ పాఠశాలలు, 13 జూనియర్ కళాశాలలకు చెందిన 49,109 మంది విద్యార్థులకు రోజూ రుచికరమైన, పరిశుభ్రమైన అల్పాహారం ఆరంభమైంది. ఈ తయారీ విధానాన్ని ఎమ్మెల్యేతో పాటు జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్, సింగరేణి అధికారులు పర్యవేక్షించారు. డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, సింగరేణి అధికారులు రాధాకృష్ణ, ఎ.వెంకటేశ్వర్‌రెడ్డి, హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ప్రతినిధులు సత్య గౌరచంద్ర దాస పాల్గొన్నారు.

వర్షం నమోదు తెలుసుకోండిలా..

న్యూస్‌టుడే, పాలకుర్తి

మీకోసం

వర్షాకాలంలో ఏ ప్రాంతంలో ఎంత వర్షపాతం కురిసిందో తెలుసుకోవాలంటే వెబ్‌సైట్ అందుబాటులో ఉందనే విషయం చాలా మందికి తెలియదు. హెచ్‌టీటీపీఎస్://టీఎస్‌డీపీఎస్.తెలంగాణ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వాతావరణ వివరాలు, ఏ జిల్లాలో, ఏ మండలంలో ఎంత వర్షపాతం నమోదైందో తెలుసుకోవచ్చు.

వర్షం రకాలు (మి.మీ.లలో)

0.0-0.2	వర్షం లేదు
0.3-2.4	చాలా తేలికపాటి
2.5-15.5	తేలికపాటి
15.6-64.4	సాధారణ
64.5-115.5	భారీ
115.6-204.4	అతి భారీ

వర్షపాతాన్ని సేకరించే విధానం

సాధారణంగా ఉదయం 8.30 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8.30 గంటల వరకు(24 గంటల వ్యవధిలో) కురిసిన వర్షాన్ని సేకరించి ఆ రోజు వర్షపాతంగా నమోదు చేస్తారు.

◆ 204.5 మి.మీ.లు లేదా అంతకు మించి కురిసిన వర్షాన్ని అత్యంత భారీ వర్షంగా పరిగణిస్తారు.

◆ ఒక మిల్లీ మీటరు వర్షపాతం అంటే: ఒక చదరపు మీటరు నేలపై ఒక లీటరు నీరు నిలిచిందని అర్థం.

త్వరలోనే ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తా : కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే: తాను భారాస బీ ఫారం మీద గెలిచి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నానని.. అమ్ముడుపోలేదని. . దీనిపై అసెంబ్లీ ఎథిక్స్ కమిటీయే ఆలోచన చేయాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. హుజూరాబాద్ మున్సిపల్ పరిధి కేసీ క్యాంపులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారాస తరఫున గెలిచిన వ్యక్తి.. కాంగ్రెస్ కండువా కప్పుకొని తిరుగుతుండటంతో ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నావో అడగటం తప్పా అని ప్రశ్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటికీ.. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న వారికి విలువలు ఉన్నట్టా, అమ్ముడుపోయిన వ్యక్తికి ఉన్నట్టా అని ఎద్దేవా చేశారు. త్వరలోనే ఎథిక్స్ కమిటీ అంశంపై స్పందిస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టేందుకు భారాస ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు హుజూరాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 2న ఉదయం 10 గంటలకు హుజూరాబాద్ అంబేడ్కర్ కూడలి వద్ద 420 అడుగుల భారీ ఫ్లెక్సీతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. 3న వీణవంకలో రైతులతో ధర్నా, 4న కమలాపూర్‌లో మహిళలు, విద్యార్థినులతో కలిసి వంటావార్పు, 5న జమ్మికుంటలో విద్యార్థులు, నిరుద్యోగ యువకులతో ర్యాలీ, 6న హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట మండల కేంద్రాల్లో ఆటో కార్మికులతో నిరసన, 7న అన్ని మండల కేంద్రాల్లోని ప్రజావాణిలో వేలాది మందితో వినతిపత్రాల అందజేత, 8న జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్, రమేష్, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, గండె శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

విద్యుత్తు అమరవీరుల స్తూపం ప్రారంభం

భగత్‌నగర్, న్యూస్‌టుడే: కరీంనగర్‌లోని విద్యుత్తు సంస్థ సర్కిల్ ఆవరణలో నిర్మించిన విద్యుత్తు అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆ సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సోమవారం రాత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంస్థలో రక్షణ ప్రమాణాల ప్రాధాన్యత, అమరుల త్యాగాలను గుర్తుచేశారు. ప్రజలకు నిరంతరం విద్యుత్తు సేవలు అందించేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన వారి త్యాగాలు స్మరించదగ్గవన్నారు. జీరో యాక్సిడెంట్ లక్ష్యంగా పని చేయాలన్నారు. ప్రతి ఉద్యోగికి నాణ్యమైన భద్రతా పరికరాలు, అవసరమైన శిక్షణ అందిస్తున్నామన్నారు. ఎంత అనుభవం ఉన్నా సేఫ్టీ ప్రొటోకాల్స్, ఎర్తింగ్ విధానాలను తప్పక పాటించాలన్నారు. అనంతరం సీతారాంపూర్‌లోని ఓ వేడుకల మందిరంలో జరిగిన ఎస్ఈ రాపెల్లి రవీందర్ పదవీ విరమణ ఉత్సవంలో పాల్గొన్నారు.

విద్యుత్తు అమరవీరుల స్మారక స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

వరి పొలంలో పడి రైతు మృతి

గంగాధర, న్యూస్‌టుడే: కాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సరిపల్లి నర్సయ్య(60) అనే రైతు సోమవారం వరిపొలంలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు వరి చేను వద్ద కట్టేసి ఉంచిన దూడను ఇంటికి తీసుకురావడానికి వెళ్లే సమయంలో కాలుజారి ప్రమాదవశాత్తు వరి బురద పొలంలో పడిపోయారు. ముక్కు మూసుకుపడిపోవడంతో శ్వాస రాక అక్కడికక్కడే మృతి చెందారు. కొద్దిసేపటి తర్వాత అటువైపు వెళ్లిన రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా అప్పటికే విగత జీవిగా ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

నర్సయ్య

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధికా జైశ్వాల్ సోమవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ మహేష్ బి.గితె తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. 2021లో తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను జనగాంకు చెందిన యటెల్లి విజయ్ అనే వ్యక్తి లైంగిక వేధింపులకు పాల్పడగా, బాలిక తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయగా, కోర్టు మానిటరింగ్ ఎస్సైలు రవీందర్‌నాయుడు, శ్రవణ్ యాదవ్ ఆధ్వర్యంలో 18 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ ఝాన్సీ వాదించగా, కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు తెలిపారు. నిందితుడికి శిక్ష పడటంలో కృషి చేసిన డీఎస్పీ నాగేంద్రచారి, తంగళ్లపల్లి ఎస్సై అశోక్, కోర్టు కానిస్టేబుళ్లు రాజేందర్, నవీన్, పోక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల, భరోసా సెంటర్ సభ్యులు లహరికను ఎస్పీ అభినందించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ప్రాధాన్యం ఇస్తోందని, ఎవరైనా వేధింపులకు గురైతే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్తకు రెండేళ్లు..

గోదావరిఖని, న్యూస్‌టుడే: భార్యపై కత్తెరతో హత్యాయత్నానికి పాల్పడ్డ భర్తకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ గోదావరిఖని జడ్జి జీవన్ సూరజ్ సింగ్ సోమవారం తీర్పు ఇచ్చారు. గోదావరిఖని ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. . స్థానిక విఠల్‌నగర్‌కు చెందిన పర్లపల్లి సంపత్(43) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో డబ్బుల కోసం భార్య స్వప్నపై గొడ్డలితో దాడికి పాల్పడ్డాడు. తర్వాత పెద్దల సమక్షంలో మరోసారి తప్పు చేయనని క్షమాపణ చెప్పి భార్యను కాపురానికి తీసుకెళ్లాడు. అయినప్పటికీ అతనిలో మార్పు రాలేదు. భార్య తన వద్ద దాచుకున్న రూ.వెయ్యి ఇవ్వడం లేదన్న కోపంతో కత్తెరతో మెడ, పక్కటెముకలపై విచక్షణారహితంగా గాయపరిచాడు. స్వప్న తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ పోలీసులు సంపత్‌ను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం ఛార్జీషీటు దాఖలు చేశారు. ఈమేరకు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా నిందితునికి రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.పదివేల జరిమానా విధించినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కోర్టు కానిస్టేబుళ్లు సతీష్‌కుమార్, కె.శంకర్‌ను డీసీపీ రాంరెడ్డి, ఏసీపీ రమేశ్‌ను సీపీ అభినందించారు.

క్షుద్ర పూజల పేరుతో టోకరా

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : క్షుద్ర పూజలు, మంత్రాలు, చేతబడుల పేరుతో అమాయక ప్రజలను నమ్మించి భారీగా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను సిరిసిల్ల పోలీసులు అరెస్ట్ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళను టార్గెట్ చేసి క్షుద్ర పూజలతో నయం చేస్తామని చెప్పి ఆమె నుంచి రూ.62 లక్షలు దండుకొని చివరికి పోలీసుల చేతికి చిక్కారు. సిరిసిల్ల ఠాణాలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మహేష్ బి.గితె వివరాలను వెల్లడించారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్ మంకమ్మతోటకు చెందిన శ్యాంకుమార్ ప్రస్తుతం హైదరాబాద్‌లో పూజా సామగ్రి దుకాణం నిర్వహిస్తున్నాడు. వేములవాడ మండలం అగ్రహారం గ్రామానికి చెందిన పి.లక్ష్మీరాజంతో అతడికి పరిచయం ఉంది. ఇద్దరూ కలిసి క్షుద్రపూజలు, మంత్రాల పేరిట మోసం చేయాలని పథకం పన్నారు. ఉప్పల్‌కు చెందిన లత అనే మహిళ శ్యాంకుమార్‌ను కలిసి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నానని చెప్పింది. ఇదే అదనుగా తీసుకున్న శ్యాంకుమార్ క్షుద్రపూజలతో దీర్ఘకాలిక వ్యాధులను లక్ష్మీరాజం అనే వ్యక్తి నయం చేస్తాడని చెప్పి ఆమెను సిరిసిల్ల తీసుకొచ్చాడు. పూజా సామగ్రి కోసం రూ.10 లక్షలు, యాదాద్రి వద్ద పూజ కోసం రూ.21 లక్షలు, కాశీలో పూజ పేరిట రూ.13 లక్షలు, విడతల వారీగా మొత్తం రూ.62 లక్షలు వసూలు చేశారు. ఎన్ని రోజులైనా అనారోగ్యం నయం కాకపోవడంతో తానిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా సదరు నిందితులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ నెల 23న డబ్బులు తిరిగిస్తాం. . సిరిసిల్లకు రమ్మని చెప్పి.. ఎంతకూ కలవకపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి అగ్రహారంలోని లక్ష్మీరాజం ఇంటి వద్ద ఇద్దరిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి రూ.30.50 లక్షల నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు బెల్లం బొమ్మలు, తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేష్ ఉన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేష్ బి.గితె

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

● ఫైనాన్సు ఒత్తిళ్లే కారణమని కుటుంబ సభ్యుల ఆరోపణ

ధర్మపురి, న్యూస్‌టుడే: ముదిరాజ్‌కాలనీలో సోమవారం సాయంత్రం పంబాల మహేశ్(29) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ధర్మపురి ఎస్సై నాగపురి సదాకర్ తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మహేశ్ 2022లో ఇంటి నిర్మాణం కోసం ఓ ఫైనాన్సు నుంచి రూ.10 లక్షల వరకు రుణం తీసుకుని ఈఎంఐల ద్వారా చెల్లిస్తున్నారు. అనారోగ్య కారణాలు, ఆర్థిక ఇబ్బందులతో ఈఎంఐలు చెల్లించడం ఆపేశారు. దీంతో నెల క్రితం సంబంధిత ఫైనాన్సు నిర్వాహకులు ఇంటికి వచ్చి మిగతా డబ్బు చెల్లించకుంటే ఇంటిని జప్తు చేసి వేలం వేస్తామని హెచ్చరించి ఒత్తిడికి గురి చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. సోమవారం ఇంటికి వచ్చిన ఫైనాన్సు నిర్వాహకులు గోడపై 'ఈ ప్రాపర్టీ ఫైనాన్సు తనఖాలో ఉందని' రాసి మరోమారు హెచ్చరించారు. దీంతో మనస్తాపం చెందిన మహేశ్ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. భార్య మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, ఫైనాన్సు వారి ఒత్తిడి, ఇంటిని వేలం వేస్తామని భయపెట్టిన కారణంగా అవమానానికి లోనై ఆత్మహత్యకు పాల్పడినట్లు ఆరోపించారు.

మహేశ్

కేజీబీవీ విద్యార్థిని ప్రేమ వివాహం

ముత్తారం, న్యూస్‌టుడే: కేజీబీవీ విద్యార్థిని ప్రేమ వివాహం చేసుకొన్న సంఘటన పెద్దపల్లి జిల్లాలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలానికి చెందిన ఓ విద్యార్థిని ముత్తారం మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ చదువుతోంది. విద్యార్థిని ఆగస్టు 23న కడుపులో నొప్పి ఉందని చెప్పడంతో సిబ్బంది ఆమె తల్లికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తర్వాత తన పెద్దమ్మ వస్తుంది అని చెప్పగా ఓ మహిళ రాగా సిబ్బంది పంపించారు. విద్యార్థిని తీసుకెళ్లే సమయంలో రిజిస్టర్‌లో ఆమె ఫోన్ నంబరు నమోదు చేశారు. కుమార్తెను చూసేందుకు సోమవారం తల్లి రాగా సిబ్బంది 23న పంపించినట్లు తెలిపారు. తమ వాళ్లు ఎవరూ రాలేదని సిబ్బందికి తెలుపగా వారు రిజిస్టర్‌లో నమోదైన నంబర్‌కు ఫోన్ చేయగా తాను ప్రేమించిన యువకుడిని ప్రేమ వివాహం చేసుకొన్నట్లు విద్యార్థిని తెలిపింది. దీంతో సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తర్వాత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. మరోసారి పోలీసులు ఫోన్ చేసి వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ స్వామి, ఎస్సై రవికుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

జగిత్యాల ధరూర్ క్యాంపు, న్యూస్‌టుడే: మేనిఫెస్టో హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల సమస్యలన్నీ వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఉద్యోగ ఐకాస రాష్ట్ర ఛైర్మన్ మారం జగదీశ్వర్ డిమాండ్ చేశారు. జగిత్యాలలోని టీఎన్జీవో కార్యాలయంలో సోమవారం జరిపిన ఐకాస జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబరు 1న పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని, 10న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. పీఆర్సీ అమలు, పెండింగ్‌లోని 6 డీఏల విడుదల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారుల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. ఐకాస జిల్లా ఛైర్మన్ మిర్యాల నాగేందర్‌రెడ్డి, కన్వీనర్ కందుకూరి రవిబాబు, పలు సంఘాల నాయకులు అమరేందర్‌రెడ్డి, వకీల్, అమర్‌నాథ్‌రెడ్డి, హరికిరణ్, సురేశ్, హరి అశోక్‌కుమార్, శ్రీనివాస్, రవీందర్, అరుణ, కరుణాకర్, విజేందర్, గంగనర్సయ్య, మహమూద్, శైలజ, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాలలో మాట్లాడుతున్న జగదీశ్వర్

చెరువులో మునిగి యువకుడి మృతి

మంథని గ్రామీణం, న్యూస్‌టుడే: చేపల కోసం వెళ్లి చెరువులో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని అడవి సోమన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. మంథని ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన చోటు భూయ్యాన్(26) గ్రామంలో సమీకృత వసతి గృహ భవన నిర్మాణ పనుల్లో కూలీగా పనిచేస్తున్నారు. సోమవారం ఉదయం గ్రామంలోని అడవిలోని మిడి చెరువులో చేపలు పట్టేందుకు నలుగురు వెళ్లారు. వీరిలో భూయ్యాన్ ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. సైట్ ఇన్‌ఛార్జి రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు. అగ్నిమాపకశాఖ అధికారి శివశంకర వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భూయ్యాన్

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి..

కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే: వ్యాపారాలు చేసి నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ వ్యాపారి కరీంనగర్‌లోని ఓ లాడ్జిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఒకటో ఠాణా ఎస్సై శేఖర్ వివరాల ప్రకారం వేములవాడకు చెందిన నరాల కార్తిక్ (33) చిటీల వ్యాపారం చేస్తుండేవారు. నష్టాలు రావడంతో మూడేళ్లుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేశారు. అందులోనూ నష్టాలు రావడంతో అప్పులపాలయ్యారు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన కార్తిక్ తన కారులో కరీంనగర్‌కు పనిపై వెళ్తున్నట్లు భార్యకు చెప్పారు. రాత్రి భార్య ఫోన్ చేయగా లిఫ్ట్ చేయపోవడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌లో వెతకడం ప్రారంభించారు. అలకాపురి కాలనీలోని ఓ లాడ్జి వద్ద కారు కనిపించడంతో వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్తిక్

EENADU e Classifieds

REAL ESTATE
LAND FOR SALE
16 Guntas Land Karimnagar Hyd. Highway Road. R.K.Colony with House and Borewell. Contact: 9848043704, 7780646886.

JOBS
ప్రముఖ సోలార్ కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. నెలకు 20వేలు + ఇన్సెంటివ్స్. మీ మండలాలలో పట్టణాలలో ఉండి పనిచేయాలి. Ph: 7075019021

రాఘవ అసెట్ ఫైనాన్స్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ GDK-4, PDPL-4, KNR-5, HZB-2, JGL-4, SRCL-4, మంథని-4 కావలెను. సెల్: 91009 02181, 82

FACULTY/ TEACHERS
Wanted: Full Time High School Social Teacher at Veenadhari H/S. CPD, KNR. 94944 99771. Salary: 30k to 50k

Wanted Teachers to teach Primary Hindi Contact: Siddhartha High School, Varahaswamy Temple, Bommakal Road, Karimnagar. Cell: 95026 51843, 98662 35525.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

Book Your 5 Lines Classified Advertisement for
B & W Rs.490/- Only
Colour Rs. 575/- Only
GST 5% Applicable in Classifieds on any day
For further details Contact:
80087 09949
80087 09950
80087 09954

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80087 09949
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14779

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM)
సిరిసిల్ల అర్బన్ : 9676021687
వేములవాడ : 8008573554

? **ముస్తాబాద్ :** పోత్గల్ ప్రాథమిక పాఠశాల భవనంలో అరకొర వసతుల మధ్య అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. నూతన భవనం ప్రారంభించేలా చొరవ చూపాలి. **-రవీందర్ స్థానికుడు**

✔ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతన అంగన్‌వాడీ కేంద్ర భవనం పూర్తయింది. ఉన్నతాధికారుల ఆదేశాలురాగానే భవనాన్ని ప్రారంభిస్తాం. **-అనూష, అంగన్‌వాడీ పర్యవేక్షకురాలు**

? **సిరిసిల్ల అర్బన్ :** పట్టణంలోని జేపీనగర్ ఈదులచెరువు వెళ్లేదారిలో తాత్కాలిక మురుగు కాల్వలో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు ముందుకు కదలడం లేదు. **-సాయికుమార్, జేపీనగర్ వాసి**

✔ వెంటనే పరిశీలించి మురుగు కాల్వలో మొక్కలు తొలగించేలా చర్యలు తీసుకుటాం.. **-మహేందర్, జేపీనగర్ వార్డు అధికారి**

నడక దారిలో.. అడుగేయలేం..

సిరిసిల్ల పాత బస్టాండ్ వద్ద పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన దుకాణ సముదాయం ఎదుట నడక దారి అధ్వానంగా మారింది.. ప్రతి నెలా మున్సిపల్ దుకాణాలకు అద్దె చెల్లిస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మరమ్మతు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు, మహిళలు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కొత్త సిమెంట్ స్లాబ్‌లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

వైభవంగా మహాలింగార్చన

వేములవాడ, న్యూస్‌టుడే : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవమూర్తుల సమక్షంలో సోమవారం వేద పండితులు, అర్చకులు మహాలింగార్చనను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 365 చిన్న ప్రమిదలను తయారు చేసి ప్రత్యేక పూజల అనంతరం వత్తులతో వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ అభివృద్ధికి విరాళం

వేములవాడ, న్యూస్‌టుడే : వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి హనుమాన్ ఆలయ అభివృద్ధికి భారాస సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి సోమవారం రూ.50,016 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొప్పెర వెంకటరెడ్డికి అందజేశారు. మనోహర్‌రెడ్డికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్‌రెడ్డి, సాయిబాబ, జగన్, నారాయణ, రాజేశం, గణేష్, మనోజ్, చక్రపాణి పాల్గొన్నారు.

భీమన్న సేవలో సమాచార కమిషన్ కార్యదర్శి

వేములవాడ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామివారిని సోమవారం రాష్ట్ర సమాచార కమిషన్ కార్యదర్శి భారతి లక్పతి నాయక్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఏఈవో జయకుమారి స్వామి, అమ్మవార్ల శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

ఆరెకటిక సంక్షేమ సంఘం భవనానికి భూమి పూజ

వేములవాడ : పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఆరెకటిక సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సోమవారం భూమి పూజ చేశారు. సంఘం అభివృద్ధికి, సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, వైస్ ఛైర్మన్ నరాల శేఖర్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ రాకేష్, పట్టణ అధ్యక్షుడు తూమ్ మధు పాల్గొన్నారు.

రూ.4 వేల పింఛను అందించాలని ధర్నా

కోనరావుపేటలో ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు, సీఐటీయూ నాయకులు

కోనరావుపేట, న్యూస్‌టుడే : బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛను అమలుతో పాటు అర్హులందరికీ జీవన భృతి పింఛను అందించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు సోమవారం ధర్నా చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో బీడీ కార్మికులకు రూ.4 వేల పింఛను అందిస్తామని హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదని మండిపడ్డారు. అనంతరం ఎంపీడీవో స్నిగ్ధకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీడీ కార్మికురాళ్లు జ్యోతి, లావణ్య, లక్ష్మీ, రూప, పద్మ పాల్గొన్నారు.

యువకుడిపై గొడ్డలితో దాడి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : ఇరువురి మధ్య స్వల్ప వివాదంతో యువకుడిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన ఇందిరానగర్‌లో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మోతె రాజు, మామిడాల రాజు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో మామిడాల రాజు ఆగ్రహంతో గొడ్డలితో మోతె రాజుపై దాడిచేసి గాయపరిచాడు. తీవ్ర గాయాలపాలైన రాజును స్థానికులు 108లో సిరిసిల్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : కుటుంబ కలహాల నేపథ్యంలో సఖీ కేంద్రానికి వచ్చిన ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన సంపత్, శ్వేత భార్యాభర్తలు.. శ్వేత అదే మండలంలోని మల్యాలలో ఏఈవోగా పనిచేస్తున్నారు. వీరికి నాలుగేళ్ల క్రితం వివాహం కాగా, కొద్ది రోజులుగా విభేదాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో భర్తపై వరకట్నం కేసు నమోదైంది. రెండు రోజుల క్రితం శ్వేత కూతురిని తీసుకొని భర్త వద్దకు వెళ్లగా మరోసారి గొడవ జరగడంతో ఠాణాకు వెళ్లారు. దీంతో పోలీసులు శ్వేతను సఖీ కేంద్రానికి తరలించారు. సోమవారం కౌన్సెలింగ్ కోసం వచ్చిన సంపత్, శ్వేత మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో తన దగ్గర ఉన్న మందు బిల్లలను వేసుకుంది. గమనించిన సఖీ సెంటర్ నిర్వాహకులు బాధితురాలిని వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక వ్యక్తికి స్వల్పగాయాలైన ఘటన తంగళ్లపల్లి మండలం నేరెళ్లలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సిరిసిల్ల నుంచి సిద్దిపేట వైపు వెళ్తున్న కారు, సిద్దిపేట నుంచి సిరిసిల్ల వైపు వస్తున్న టాటా ఏస్ మినీ గూడ్స్ వ్యాన్ నేరెళ్ల శివారులోని మూల మలుపు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో కారులో ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. 108 అంబులెన్సులో సిరిసిల్ల ఆసుపత్రికి తరలించారు.

విధులకు ఆటంకం.. ఇద్దరికి రిమాండ్

వీర్నపల్లి, న్యూస్‌టుడే : అటవీ శాఖ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై లక్ష్మణ్ సోమవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... భూక్య తండా శివారులోని గొల్లపల్లి సెక్షన్ అటవీ ప్రాంతంలో రాసిగుట్ట తండాకు చెందిన తేజావత్ మోహన్, రమేష్ అటవీ భూమి ఆక్రమణకు పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఆగస్టు 26న అక్కడికి చేరుకొని అడ్డుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కార్యాలయానికి వెళుతున్న క్రమంలో అడ్డగించి విధులకు ఆటంకం కలిగించారు.. బీట్ అధికారి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు వివరించారు. నిందితుడు తేజావత్ మోహన్‌పై బీట్ అధికారి శ్రీకాంత్‌ను గాయపరిచిన ఘటనలో 2025లో కేసు నమోదైందన్నారు.

మూఢనమ్మకాల పేరుతో మోసం.. కేసు నమోదు

వేములవాడ గ్రామీణం : మూఢనమ్మకాల పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న వారిపై పోలీసులు ప్రత్యేక దాడులు జరిపి కేసులు నమోదు చేశారు. ఎస్పీ మహేష్ బి.గితె ఆదేశాల మేరకు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ, గ్రామీణ పోలీసులు సోమవారం సాయంత్రం చీర్లవంచ, అగ్రహారం, తెట్టెకుంట గ్రామాల్లో పూజారులుగా పరిచయం చేసుకొని మోసాలకు పాల్పడుతున్న పలువురి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. వారి నుంచి నాటు వైద్యానికి సంబంధించిన మూలికలు, తాయిత్తులు, పూజా సామగ్రిని స్వాధీనం చేసుకుని పలువురిపై కేసు నమోదు చేశారు. క్షుద్ర పూజలు, చేతబడులు, గుప్తనిధులు, మంత్రాల పేరుతో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసి మోసం చేయడానికి ప్రయత్నిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోదాల్లో సీఐలు వీరప్రసాద్, శ్రీనివాస్, సబ్ డివిజన్ ఎస్సైలు పాల్గొన్నారు.

సమస్యలు విన్నవించి.. పరిష్కారం ఆశించి

● ప్రజావాణికి 162 అర్జీలు

దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ గరిమా అగ్రవాల్

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జడ్పీ సీఈవో వెంకటమాధవరావు 162 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతగా వ్యవహరించి అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

☛ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణిలో ఆర్డీవో శ్రీధర్ బాబు 4 దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత అధికారులకు అందజేసి, సకాలంలో పరిష్కరించాలని సూచించారు. తంగళ్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి ప్రజావాణిలో ఎంపీడీవో రమేష్ ప్రజల నుంచి 12 దరఖాస్తులు స్వీకరించారు.

పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలి

తెలంగాణ సహకార చట్టం 1964, కేంద్ర ప్రభుత్వం నియమించిన వైద్యనాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ప్రాథమిక సహకార సంఘాల పాలకవర్గ గడువు ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి సకాలంలో ఎన్నికలు నిర్వహించాలి. కానీ, ప్రస్తుత ప్రభుత్వం ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపకుండా, సొసైటీల్లో రైతుల ఆమోదం లేకుండా ప్రస్తుతం ఉన్న పాలకవర్గాలను తొలగించి నామినేషన్ పద్ధతి ద్వారా నూతన పాలకవర్గాలను నియమించేందుకు సిద్ధమవుతోంది. నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసి, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి.

- జిల్లాలోని పీఏసీఎస్ ఛైర్మన్‌లు

ఎరువులు ఇప్పించండి..

పలు సర్వే నంబర్లలో సుమారు 260 ఎకరాల ప్రభుత్వ భూమిని 100 కుటుంబాలు పూర్వకాలం నుంచి సాగు చేస్తున్నాయి. కూరగాయలు, పత్తి, వరి, పలు రకాల పంటలను కాలానుగుణంగా వేస్తున్నాం.. ఇదే మాకు జీనాధారం. మొన్నటి వరకు వ్యవసాయ అధికారుల యాప్‌లో ఆన్‌లైన్‌లో చూపించింది.. ప్రస్తుతం కొత్త యాప్‌లో ఈ వివరాలు చూపించడం లేదు. మాకు ఆ భూములకు పట్టాలిప్పించి, మా పంట పొలాలకు ఎరువులను వచ్చేలా చూడాలి.

- ఇందిరానగర్, భరత్‌నగర్ ప్రజలు, తంగళ్లపల్లి

అన్ని ఖాళీలను భర్తీ చేయాలి

ప్రభుత్వం ఇటీవల శారీరక వికలాంగుల కోసం ప్రత్యేక నియామక డ్రైవ్(ఎస్ఆర్‌డీ) ద్వారా రిజర్వ్ చేయబడిన బ్యాక్‌లాగ్ ఖాళీలను భర్తీ చేయడానికి జీవో జారీ చేసింది. అర్హత, విద్య కలిగిన దివ్యాంగులు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా వినికిడి లోపం ఉన్నవారు, చెవిటివారు, తమకు కేటాయించిన రిజర్వేషన్ కింద ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. దివ్యాంగుల కోసం రిజర్వ్ చేయబడిన అన్ని బ్యాక్‌లాగ్ ఖాళీలను గుర్తించి భర్తీ చేయాలని మనవి.

- జిల్లా బధిరుల సంఘం సభ్యులు

పల్లగుట్ట తవ్వకం తగదు..

నామాపూర్ గ్రామ పరిధిలోని పల్లగుట్టను కొంత మంది గుత్తేదారులు లీజ్ అగ్రిమెంట్ పేరుతో తవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారు. దీంతో పక్క గ్రామాలైన నామాపూర్, గూడూరు గ్రామాల్లో పర్యావరణం దెబ్బతింటుంది. గుట్టలో అనేక వన్యప్రాణులు జీవిస్తున్నాయి. వాటి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. గుట్ట చుట్టూ రెండు గ్రామాల పశువులు, గొర్రెలు, మేత కోసం ఆధారపడి ఉన్నాయి. గుత్తేదారులకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వొద్దని మనవి.

- సర్పంచి, పాలకవర్గ సభ్యులు, నామాపూర్, ముస్తాబాద్

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

నూతన బాధ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ప్రజాపాలన, ఇందిరమ్మ రాజ్యం 1000 రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వేములవాడ రూరల్, అర్బన్ మండలాల్లో నూతనంగా ఎంపికైన మండల, గ్రామ కాంగ్రెస్ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత భారాస పాలనలో రాష్ట్రం భారీగా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై భారాస, భాజపాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గ్రామస్థాయిలో ప్రతిపక్షాల ప్రచారానికి వాస్తవ సమాచారంతో సమాధానం ఇవ్వాలని మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులకు సూచించారు.

సిరిసిల్ల కలెక్టరేట్ : సీఎం రేవంత్ వెయ్యి రోజుల పాలన సందర్భంగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. పట్టణ అధ్యక్షుడు దేవరాజు, బాలరాజు, దేవయ్య పాల్గొన్నారు.

కూలీ పెంచాలని కార్మికుల సమ్మె

మాట్లాడుతున్న కోడం రమణ

సిరిసిల్ల(విద్యానగర్) : కాటన్ చీరలకు సంబంధించిన కూలీ పెంచాలని తెలంగాణ రాష్ట్ర పవర్‌లూం వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు, ఆసాములు సోమవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. సిరిసిల్లలోని నెహ్రూనగర్ అంబా భవాని ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ మాట్లాడారు. కాటన్ చీరలకు సంబంధించి ఆసాములు, కార్మికుల కూలీ ఒప్పందం ముగిసి 30 నెలలు అవుతున్నా యజమానులు కూలీ పెంచకపోవడం విచారకరమన్నారు. కాటన్ చీరకు కార్మికులకు రూ.100, ఆసామికి రూ.150 కూలీ అందించాలని డిమాండ్ చేశారు.

ప్రతి ఫిర్యాదుపై స్పందించాలి

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్పీ మహేష్ బి.గితె

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితె పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 'గ్రీవెన్స్ డే' కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి 26 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్‌చేసి మాట్లాడారు. ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని సూచించారు.

ప్రణాళిక ప్రకారం చదివితేనే లక్ష్య సాధన

వేములవాడ, న్యూస్‌టుడే : విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదివి అనుకున్న లక్ష్యం సాధించాలని కలెక్టర్ గరిమా అగ్రవాల్ సూచించారు. సోమవారం రాత్రి పట్టణంలోని మైనార్టీ గురుకుల విద్యాలయాన్ని సోమవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యాలయంలో అవసరమైన వసతులు, సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఒక్క ఓటూ గల్లంతు కావొద్దు..

వీర్నపల్లి, న్యూస్‌టుడే : అర్హులైన ఏ ఒక్కరి ఓటు హక్కు గల్లంతు కాకుండా బూత్ స్థాయి ఏజెంట్లు పనిచేయాలని నియోజకవర్గ కోఆర్డినేటర్ ప్రవీణ్ టోనీ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం బూత్ కమిటీలకు అవగాహన కల్పించారు. సర్ ప్రక్రియలో ఏజెంట్లు కీలకంగా వ్యవహరించాలన్నారు. నోటీసులు అందుకున్న ఓటరుకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, రాములు, రాము, తిరుపతి పాల్గొన్నారు.

మట్టి అక్రమ తరలింపుపై చర్యలేవీ?

తహసీల్దార్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల భారాస నాయకులు

బోయినపల్లి, న్యూస్‌టుడే : రైల్వేలైన్ నిర్మాణ పనుల పేరుతో అనుమతులకు మించి మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తున్నారని భారాస మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ఆరోపించారు. ఈ మేరకు మండల ప్రజావాణిలో తహసీల్దార్ షరీఫ్‌కు వినతిపత్రం సమర్పించారు. వెయ్యి క్యూబిక్ మీటర్లకు అనుమతులు తీసుకొని రోజుకు మూడు నుంచి నాలుగు వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలిస్తున్నారని అన్నారు. అనుమతులు లేకుండానే భారీ యంత్రాలను వినియోగించి మట్టి తవ్వుతున్నారని, రోజుకు 30 నుంచి 40 లారీల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో ఈ వ్యవహారం కొనసాగుతోందని, వెంటనే తవ్వకాలు నిలిపివేసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలపై నిర్లక్ష్యం

సిరిసిల్ల గ్రామీణం : సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సిబ్బంది తీరుపై మరోసారి ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుడి వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సాయి గణేష్ అనే వ్యక్తికి ఎడమ భుజం దగ్గర ఎముక విరగడంతో నాలుగు రోజుల క్రితం ఆసుపత్రికి వచ్చాడు. సోమవారం ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించడంతో ఆపరేషన్ థియేటర్‌కు వెళ్లాడు. తీరా వెళ్లాక గడ్డం, మీసాలు తొలగించలేదని అందులో పనిచేస్తున్న టెక్నీషియన్ దురుసుగా ప్రవర్తించి బయటకు పంపించినట్లు బాధితుడు వాపోయాడు. తనకు ముందస్తుగా ఎవరూ చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను నాలుగు రోజుల నుంచి విపరీతమైన నొప్పితో బాధపడుతున్నానని, తీరా సమయానికి ఇలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇటీవల సిబ్బంది నిర్లక్ష్యంపై సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టగా, తాజాగా మరో ఘటన చోటు చేసుకోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

పుట్ట గొడుగుల సాగుతో అదనపు ఆదాయం

శిక్షణలో పాల్గొన్న రైతులతో కళాశాల ప్రొఫెసర్లు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే : పుట్ట గొడుగుల సాగుతో రైతులు, యువత తక్కువ పెట్టుబడితో అదనపు ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు తెలిపారు. సోమవారం జిల్లెల్లలోని వ్యవసాయ కళాశాలలో పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో స్వయం ఉపాధి, చిన్నతరహా పారిశ్రామిక అవకాశాలను పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. అనంతరం పుట్టగొడుగుల పెంపకం విధానం, సాగుకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, వివిధ రకాల పుట్టగొడుగులు, సంరక్షణ, మార్కెటింగ్, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రజియా సుల్తానా, లావణ్య, రాజేంద్ర ప్రసాద్ , మహిళా రైతులు, బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

■ నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే : వేములవాడ మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నేటి నుంచి ఈ నెల 3 వరకు నాంపల్లిలోని నిర్మలా పాఠశాలలో నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి బాణాల సదానందం తెలిపారు. అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

■ భీమన్నను దర్శించుకున్న జానపద గాయని

వేములవాడ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి అనుబంధ శ్రీ భీమేశ్వరస్వామి వారిని ప్రముఖ జానపద గాయని మామిండ్ల మౌనిక యాదవ్ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం ఇచ్చి స్వామివారి ప్రసాదం అందజేశారు.

■ షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్తు అంతరాయం

బోయినపల్లి : ఎంపీడీవో కార్యాలయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు కూడా అసౌకర్యానికి గురయ్యారు.

■ మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

సిరిసిల్ల గ్రామీణం : జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ.. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను సాధించేందుకు వైద్యాధికారులు సమన్వయంతో పని చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ సూచించారు. సోమవారం పీహెచ్‌సీల వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో క్షయ, కుష్ఠు, ఎయిడ్స్ నియంత్రణ, అంధత్వ నివారణ, జాతీయ టీకాల కార్యక్రమం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో వైద్యాధికారులు సంపత్‌కుమార్, రామకృష్ణ, వేణుగోపాల్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

■ నేత్రదానంపై అవగాహన

సిరిసిల్ల అర్బన్ : నేత్రదానం చేసి చూపులేని వారి జీవితాల్లో వెలుగు నింపాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం కార్యాలయంలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ దార్ల సందీప్, వార్డు కౌన్సిలర్లు, జిల్లా అంధత్వ నివారణ అధికారిణి డాక్టర్ నయీమ, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, వైద్యఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

■ సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఎల్లారెడ్డిపేట : సైబర్ నేరాలపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్సై రమేశ్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిరలో సోమవారం జనాలకు అవగాహన కల్పించారు. నగదు రహిత లావాదేవీలతో పాటు, బ్యాంకు, డిజిటల్ అరెస్టుల పేరిట జరిగే మోసాలపై చైతన్యం కలిగించారు. రహదారి భద్రత నియమాలను విధిగా పాటించాలన్నారు.

■ అసమానతలు లేని సమాజమే ధ్యేయం

వీర్నపల్లి : అసమానతలు లేని సమాజమే లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ పని చేస్తుందని జిల్లా నాయకుడు కానపురం లక్ష్మణ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం క్రియాశీల సభ్యులతో సమావేశమయ్యారు. ఈ నెల 9న తలపెట్టిన వరంగల్ సభకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ఎల్లం, శామ్యూల్, నర్సయ్య, మైసయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

■ కాంగ్రెస్ నుంచి ఇద్దరి సస్పెన్షన్

ముస్తాబాద్ : పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులను కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ ఆదేశాల మేరకు పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గజ్జెల రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోత్గల్ గ్రామానికి చెందిన తోట ధర్మేందర్, జంగ రాజులను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.

■ ఆరు గ్యారంటీలను విస్మరించారు..

కోనరావుపేట : కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు, 420 హామీలను విస్మరించిందని భారాస మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆరోపించారు. కోనరావుపేటలో సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబరు 2-8 వరకు నియోజకవర్గ కేంద్రంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆధ్వర్యంలో ప్రభుత్వంపై నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెస్ ఉపాధ్యక్షుడు తిరుపతి, సర్పంచి మల్లేశంయాదవ్, స్వామిదాసు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు భూంరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే : కులం పేరుతో దూషించారనే ఫిర్యాదు మేరకు మల్లారం సర్పంచి అర్పిత, ఆమె భర్త వీరారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ గ్రామీణ పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ రవీందర్ వివరాల ప్రకారం.. గ్రామంలోని 9వ వార్డు సభ్యుడు అనిల్‌ను గ్రామ సర్పంచి, ఆమె భర్త కులం పేరుతో దూషించారని, కుల వివక్షకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వార్డు సభ్యుడు అనిల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

గణాంక అధికారికి ఆత్మీయ సన్మానం

సిరిసిల్ల గ్రామీణం : ఆర్థిక, గణాంక శాఖలో 34 ఏళ్ల పాటు సేవలందించిన గణాంక అధికారి బూట్ల చంద్రమౌళి సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్లలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో అధికారులు, గణాంక సిబ్బంది, విశ్రాంత ఉద్యోగులు ఆయన్ను శాలువా, పూలమాలతో సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారి శ్రీనివాసచారి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

(c) eenadu